**సర్కాళ్ళ ఇన్స్‌పెక్టరు బాలకృష్ణ పులిచెర్ల బ్లాకులో యింకా కాలైనా మోపలేదు, అతడి అడుగులకు తివాచీలు పరుచుకుంటూ ముందుగా వొచ్చేసింది అతడి యశోకాంత.**

# తొలిముద్దుకు వెలఎంత?

## కలువకొలను సదానంద

చిన్నగొట్టిగల్లులో పెళ్ళీ పేరంటం లేకుండా ఒంటరిగా వుంటున్న ఓ పంతులమ్మ యింట్లో ఓ రాత్రి ఆతిథ్యం స్వీకరించి. ఆమె చెయ్యి పట్టు కున్నాడట బాలకృష్ణ. ఆమె గింజుకుంటే. "మరేం కంగారు పడకు నిన్ను పెళ్ళిచేసుకుంటాను" అన్నాట్ట. ఆమె పెళ్ళిమాట దేవుడెరుగు, ఆమె పెట్టిన కేకలకు ఇరుగు పొరుగువాళ్ళంతా నురగలుగక్కే కెరటాల్లా లేచివచ్చి చుట్టు ముట్టి ఘనంగా అతిడి పెళ్ళి చేశారు.

మెతుకు పట్టిచూస్తేచాలు. అన్నం వుడి కిందీ లేనిదీ చెప్పొచ్చు! బాలకృష్ణ గ్రంథ సాంగుడే నన్న అభిప్రాయానికి రావడానికి పై ఉదంతం పులిచెర్ల సమితి టీచర్లకు మెతుకులా ఉపకరించింది.

చిన్నగొట్టిగల్లులో రిలీవ్ అయి పులిచెర్లలో చార్జీ తీసుకోగానే, కొటాల. పనపాకం, పాకాల. దామల్ చెరువు. మంగళంపేట. కల్లూరు అంటూ ఏ ఒక్కటీ విడిచి పెట్టకుండా - శనివారాలలో జరిగే కేంద్రోపాధ్యాయ సంఘ సమావేశాలన్నిటికీ హాజరయ్యాడు బాలకృష్ణ. విద్యా విషయాలను గురించి కాకుండా. శృంగార నైషధాన్ని గురించీ. శృంగార రస పోషణలో శ్రీనాథుడి నేర్పరితనాన్ని గురించీ. దమయంతీ నిషధరాజుల తొలిరేయి ముచ్చట్లను గురించీ ప్రతి మీటింగులోనూ గంటసేపు పారవశ్యంతో ప్రసంగించాడు. పంతులమ్మల ముసి ముసి నవ్వులే కరతాళధ్వనుల్లుగా భావించి. శృంగార రసగుళికల్లాంటి పద్యాలను శ్రావ్యంగా ఆలాపించాడు.

"మీ వయస్సెంత సార్?" అని ఎవరో ఓ కుర్ర పంతులడిగితే. "ఎంతుంటుందను కుంటున్నావ్?" అని చిరునవ్వుతో ఎదురు ప్రశ్న వేశాడు బాలకృష్ణ.

"దరిదాపుగా నలభై అనుకుంటాను."

"అంతే అనుకో!" అన్నాడు బాలకృష్ణ.

ఆయన మరో ఐదేళ్ళకే రిటైర్ కాబో తున్నాడని ఇన్‌స్పెక్టర్ గుమాస్తా చెప్పినప్పుడు ఆ మాట నమ్మలేకపోయారు టీచర్లు. జాతి గుర్రంలా చకచకా నడుస్తాడు బాలకృష్ణ. ఏభై ఆరు అక్షరాలలో ఏ ఒక్కటీ తుప్పబోకుండా స్పష్టంగా పలుకుతాడు. అత్తగారింటికి బయల్దేరిన కొత్తల్లుడిలా నిత్యమూ నిగనిగలాడే బుష్ కోటూ, గొట్టం పంట్లామూ తొడుక్కుంటాడు. రంగు వేసుకుంటాడో లేదోగానీ. క్రాపు నల్లగా వుంటుంది. పొద్దు పొడవక ముందే షేవింగ్ చేసుకోవడం దినచర్యగా పెట్టుకున్నాడేమో. ఆపిల్ పండుతో పోటీ పడుతున్నట్లున్న ముఖంలో ఎక్కడైనా ఒక తెల్లవెంట్రుక మెలుస్తుందో లేదో ఎవరికీ తెలియదు. ఇంత వైభవంతో అల రారుతున్న ఆ బాలకృష్ణ విగ్రహానికి ఏభై ఏళ్ళు దాటిందంటే. అది విడ్డూరమే కదా?

సమితి కేంద్రమైన పులిచెర్లలో వాలినా. సమితి ప్రాంతంలోని పాఠశాలల్ని సందర్శించినా. ఆ పక్షి రెక్కలు ముడుచుకునే గూడు మాత్రం తిరుపతి.

తీట సిగ్గెరగదంటారు. పంతులమ్మల్లో తనకు పనికొచ్చేవాళ్ళెవ్వరూ లేరని తెలుసు కున్నాక. పోయిన చోటల్లా తనకొక వధువును చూసిపెట్టమని పంతుళ్ళను పురమాయించడం మొదలు పెట్టాడు బాలకృష్ణ. "మాటా పలుకూ లేకుండా పోతావెందుకే పాతగ్రహచారమా, మాయింటిదాకా రా!" అనగలిగే సాహసం పంతుళ్ళలో ముప్పాతికా మువ్వీసం మందికి వుండదు. "వాకబు చేస్తామండీ!" అని తెలివిగా సమాధానమిచ్చి సాగనంపడం తప్ప వాళ్ళు చేసిందేమీ లేదు.

కల్లూరు టీచరు కలాముల్లా మాత్రం చూసిరమ్మంటె కాల్చివొచ్చే వాడిలా కాలర్ యెగరేశాడు. "మీ కోసం పిల్లను మాట్లాడాను సార్! మీరొచ్చి చూసి. సరే నంటే సెటిల్ చేసేస్తాను. పిల్ల బంగారపు బొమ్మ. బూరగమందలో వుంది."

బాలకృష్ణకు గుండె గొంతులోకి తన్నుకొచ్చింది. "సెభాష్! వయసెంతుంటుంది?

### అరణ్యకాండ

అడవుల్లో అడుగు పెయ్యటమేకాదు
పాదాలు. పదాలు సోకి
రాళ్ళు కూడా మనుషులవ్వాలి
నాతిని. నీతిని చెరబట్టిన నీచుల
చెట్టు చాటు నుండి గెరిల్లాల
చావుదెబ్బ తీయాలి
రెక్కలు విరిగిన పక్షుల
నెత్తురు గురుతుల
వెంట వెళ్ళి
మహాంభోధికి వారధి కట్టడానికి
ఉడుతను కూడా
సమాయత్తం చేయాలి
సమతను చెరపెట్టిన
తలలు పడగొట్టడానికి
ఆయువుపట్టులో
అమ్ము విసరాలి
అరణ్యం నే పథ్యంగా—!

—గణేష్‌బాబు

రుజువైందా—?" రేడియో బాలానందం కార్యక్రమంలో పద్యం అప్పజెప్పే పసి మొలకలా ఆయాసంతో మాటలు మింగేస్తూ అడిగాడు.

"వయస్సు యిరవయ్యే సార్! రుజువై అయిదేండ్లయింది. పెళ్ళయి నాలుగేండ్లయింది. మొగుడుపోయి మూడేండ్లయింది."

కలాముల్లా యిలా అనగానే, చేదుమందు మింగినట్లయింది బాలకృష్ణకు. "లక్షణమైన పిల్లను చూడమంటే, ముండమోపిని చూసొచ్చావేంటయ్యా? వాచిన కుక్కననుకున్నావా, పాచినకూడు తినడానికి?"

"అరే! ముండమోపయితే ఏమిటాసార్? రంభలాగుంటుంది."

"నాక్కావల్సింది కన్నెపిల్ల! రంభకాదు"

"కన్నెపిల్ల అంటే ఏమిటాసార్?" అంటూ బుర్ర గోక్కున్నాడు కలాముల్లా.

అలాటి ప్రశ్న అడగాలేగానీ సవివరంగా సమాధానమివ్వగల ఓపికా, ఉత్సాహమూ బాలకృష్ణకంటే ఎక్కువగా మరెవరికున్నాయి?

కన్నెపిల్లను వెతకగలిగిన బెస్ట్ టీచర్లు పాకాలలో లభించారు బాలకృష్ణకు. బడికి సక్రమంగా వెళ్ళలేనివారు, తిథి తప్పని చంద్రుడిలా జీతపు బిల్లులు మాత్రం విధిగా పంపుకుంటూ ఇతర వ్యాసంగాలతో పొద్దుపుచ్చేవాళ్ళూ, బెస్టు టీచర్ అవార్డు కోసం భ్రష్టయాగాలు తలపెట్టేవాళ్ళూ అతడికి సన్నిహితులై, కాలితో చెయ్యమన్న పనిని చేతితో చెయ్యడానికి సంసిద్ధులైనారు. అలాంటివారిలో రైలుపేట హెడ్మాస్టరు మైలమాచారీ, దామల్ చెరువుదగ్గిర కుక్కలపల్లిలో సింగిల్ టీచరుగా వుంటూ పిల్లల కాలేజీ చదువులకోసం పాకాలలో కాపురం పెట్టిన మోహన మంగళం ప్రథమ తాంబూలానికి అర్హులు.

పెళ్ళిసంబంధాలు కుదర్చడంలో మైలమాచారి దిట్ట. తన చేతులమీదుగా కొన్ని అంతర్రాష్ట్రీయ వివాహాలు సైతం జరిపించిన ఘనత అతనికుంది. ఊరి పొలిమేరలైనా దాటకుండా, భక్తాంజనేయస్వామి దేవాలయంలో అర్చకుడుగా అష్టకష్టాలనుభవిస్తున్న అనంతరామయ్య పెద్దకూతురితో దాదాపు పెళ్ళి నిశ్చయమైనంత కథ నడిపించాడు మైలమాచారి.

నిమిషాలపైన బెల్‌బాటమ్ పంట్లాం, పువ్వుల స్లాకూ కుట్టించుకుని, క్రాపు సవరించుకుని, ముఖానికి తుదిమెరుగులు దిద్దుకుని, కుడి ఎడమల డాల్ కత్తులు మెరిసినట్లుగా మైలమాచారినీ మోహనమంగళాన్నీ వెంటబెట్టుకుని వెళ్ళి పిల్లను చూశాడు బాలకృష్ణ. వయసొచ్చిన పిల్ల బాగులేకపోవడమేమిటీ? సుద్దముక్కలాగా తెల్లగా తీరుగా వుంది! ఓకే అనేశాడు బాలకృష్ణ.

అరుగుమీదికొచ్చి కూర్చున్న ఇరుగమ్మకూ పొరుగమ్మకూ చెప్పిందే మళ్ళీ మళ్ళీ చెప్పడంవల్ల ఆరోజు అనంతరామయ్య భార్యకు నోరు నొప్పి పుట్టిపోయింది. "అబ్బాయికి ముప్పై ఏళ్ళే! ఇన్‌స్పెక్టరుట! నాలుగంకెల్లో జీతం! పైసా కట్నం కూడా పుచ్చుకోనంటున్నాడు. ఇద్దరికీ ఈడూజోడూ బాగానే వుంది. ముడిపెట్టేస్తే సరిపోతుంది."


రెండు రోజుల తర్వాత రాయబారి హోదాలో పెళ్ళి ఏర్పాట్లను గురించి ముచ్చటించటానికి ఆ ఇంటికి వెళ్ళాడు మోహన మంగళం. హోదాకు తగ్గ మర్యాదలు లేకపోతే పోయిందిగానీ చెప్పుదెబ్బల పంపకంలో అతడికి వాటా లేకపోవడం అతడి పుణ్య విశేషం! అనంతరామయ్య అతణ్ణి గుమ్మంలోనే ఆపి "కడుపుకు ఏం తింటారయ్యా మీరు? పెళ్ళాం బిడ్డలున్న వాణ్ణీ, వయసులో నాకంటే పెద్దవాణ్ణీ పట్టుకొచ్చి నా బిడ్డ గొంతు కొయ్యాలనుకున్నారా? మీకు లేరా కూతుళ్ళు?" అంటూ, వీధి వీధంతా వొరిగి పడిపోయేలా ఖణేల్లున రంకెవేశాడు

"ఆ విషయం నాకు తెలియదండీ!" అని చెప్పటానికి మోహనమంగళం నోట్లో తేమ వుంటే కదా? "వెళ్ళి చెప్పు! మళ్ళీ మా గుమ్మం తొక్కితే, పిల్లనడిగిన ఆ ఇన్‌స్పెక్టర్నీ, పెత్తనానికొచ్చిన ఆ మైలమాచారినీ ఎడంకాలి చెప్పుతో ఎంచి ఏడు దెబ్బలు కొడ్తానని చెప్పు!" అంటూ దడాలున తలుపు మూసుకున్నాడు అనంతరామయ్య.

పెళ్ళి కూతురులేని మేనాలా తిరిగొచ్చిన మోహన మంగళాన్ని చూచి, గుప్తపెట్టుకున్న గుప్తధనం పోలీసుల స్వాధీనమైపోయినట్లుగా బాధపడి పోయాడు బాలకృష్ణ.

"ఔనా సార్? మీకు పెళ్ళాం పిల్లలున్నారా!" అని అడిగాడు మోహన మంగళం.

"ఉంటే ఏమిటటా? ఎవరికీ అన్యాయం చెయ్యను కదా? వేరే కాపురం పెడతాను కదా? ఉన్న ఆస్తి ఏదో మొదటి పెళ్ళానిది. ఉద్యోగంలో వొచ్చే సొమ్మంతా రెండో పెళ్ళానిది! ఈ క్షణంలో రిటైరయినా, యాభై వేలొస్తుంది నాకు. మైలమాచారీ!




అనంతరామయ్యగార్ని ఒప్పించటం సాధ్యం కాదా?" అన్నాడు బాలకృష్ణ.

"చెప్పుదెబ్బలనేవి చికెన్‌బిరియానీ కాదు గదా, అడిగి తినటానికి? వొదిలేయండి సార్! దీని తాతలాంటి సంబంధం చూసే పూచీ నాది!" అన్నాడు మైలమాచారి, బల్ల గుద్దినంత గట్టిగా.

ప్రతిజ్ఞ చేసినవాడు మైలమాచారి ఐతే, ఆ అవకాశం అతడికి అందకుండా చేసినవాడు మోహన మంగళం. ఒకనాటి సాయంకాలం అతను దామల్ చెరువు పేసెంటర్‌కు వెళ్ళి నెలజీతం తీసుకుని, ఇల్లుచేరుకుందామని రైల్వేస్టేషన్‌కు వెళ్ళాడు. రైలు కదలబోతున్నది. పరుగునవెళ్ళి ఒకపెట్టెలోకి ఎక్కాడు మోహనమంగళం. అతణ్ని చూడగానే ఓ పద్దెనిమిదేళ్ళ చామనచాయ మెరుపుతీగ ఎగిరి గంతేసి, "అరే! రండన్నయ్యా, ఇలా వచ్చి కూర్చోండి!" అంది. మోహన మంగళం సందేహిస్తూ ఆమె పక్కన కూర్చున్నాడు. ఆమె తనకు గుర్తున్నట్లే అభినయిస్తూ "ఏమమ్మా!...." అన్నాడు. ఆ మాటను యింకా పొడిగించటానికి ఆమె ఎవరో తనకు తెలిస్తేకదా—

"మీరిక్కడ కనిపిస్తారని నేననుకోనే



లేదు. వదిన బాగుందా?" అందా అమ్మాయి.

"బాగుంది."

"పిల్లలూ?"

"పిల్లలు కూడా!"

"ఎన్నాళ్ళయిందో వాళ్ళను చూసి!"

ఇద్దరు ముగ్గురు ప్రయాణీకులు "వచ్చేది పాకాలే కదూ?" అంటూ తలుపు దగ్గరకు లేచి వెళ్ళారు.

పాకాలలో రైలు ఆగింది. మోహన మంగళం పైకి లేచాడు "ఎక్కడి కన్నయ్యా?" అంది ఆ అమ్మాయి.

"ఇంటికమ్మా!"

"ఏమిటీ? అప్పుడే వొచ్చేశామా? ఈ సంచీ అందుకోండి!" అని అతడిచేతికి సంచీ అందించి. ఆమె కూడా దిగింది.

ప్లాట్ ఫారంమీద నడుస్తూ, "నువ్వెవరో గుర్తు రావటం లేదమ్మా నాకు!" అన్నాడు మోహన మంగళం.

"మన్నించండి! మీతో నాటక మాడాల్సొచ్చింది."

"ఎందుకూ?"

"ఇక్కడెలా చెప్పగలను?"

ప్లాట్ ఫారం రెండో చివరికి నడిచి అక్కడ నిర్మానుష్యంగా వుండడంతో, మసక చీకటి ముసుగు చాటున ఓ బెంచీ మీద కూర్చున్నాడు మోహన మంగళం. ఆమెను కూర్చోమన్నాడు. "నేను తిరుపతికి వెళ్తున్నానండీ! మదనపల్లి నుంచీ ఇద్దరు రౌడీలు వెంటబడి అల్లరి మొదలెట్టారు. ఒంటరిదాన్ని భయమేసింది. అందుకే మీతోబాటు దిగేశాను" అందామె.

మోహనమంగళం ఆమెవైపు పరీక్షగా చూశాడు. అప్పుడే పెంకు పగల గొట్టుకుని బయటికి తొంగి చూస్తున్న కోడిపిల్లలా వుందామె యౌవనం.

"ఏ వూరు మీది?"

ఆమె సమాధానం చెప్పలేదు.

"తిరుపతికి ఎందుకెళ్తున్నావ్?"

బదులు లేదు.

"చుట్టాలున్నారా తిరుపతిలో?"

ముఖం అటు తిప్పుకుందామె.

"దిక్కూ మొక్కూ ఎవరూ లేరానీకు?"

ఆమెకు ఏడుపు పొంగుకొచ్చేసింది. రెండు నిమిషాలపాటు నిశ్శబ్దంగా ఏడ్చి, కొంగుతో కళ్ళొత్తుకుని, వెక్కిళ్ళు ఆపుకుంటూ "నన్నేమీ అడక్కండి!" అంది.

ఆమె గతాన్ని తవ్వి తలకెత్తుకునేకంటే, ఆమె భవిష్యత్తును బాలకృష్ణతో ముడిపెడితే బాగుంటుందికదా అన్న ఆలోచన తళుక్కున మెరిసింది అతడి బుర్రలో. వెంటనే అతడు ముగ్గుగీచాడు. "నువ్వు సరేనంటే, రేపే అతడిచేత మూడుముళ్ళు వేయించేస్తాను" అంటూ ముగించాడు.

ఆమె ఔననలేదు, కాదనలేదు. అతడు పైకి లేచాడు. ఆమె కూడా లేచింది. అతను నడిచాడు. అతడివెంట ఆమెకూడా నడిచింది. అతను యిల్లు చేరుకుని, "ఈవిడ ఇన్స్పెక్టరుగారి తాలూకు! భోజనం సంగతి చూడు!" అన్నాడు పెళ్ళాంతో.

"మీ కోసం ఇన్స్పెక్టరుగారు రెండు సార్లొచ్చి పోయారండీ!" అంది అతడి భార్య.

పరుగులాంటి నడకతో మెయిన్ రోడ్డు చేరుకున్నాడు మోహనమంగళం. ఎదురు పడిన మిత్రుణ్ణి "ఇన్స్పెక్టరుగారేమైనా కనిపించారా?" అని అడిగాడు.

"అదిగో, పోతోంది చూడు బస్సు! ఇప్పుడే ఎక్కాడు."

మోహనమంగళం బస్సువెంట పరుగు తీశాడు. దయామయుడైన డ్రైవరు బస్సు ఆపాడు.

సంగతివిన్న బాలకృష్ణకు ముఖం చేటంతయింది. స్వయంవరానికి బయల్దేరిన రాకుమారుడిలా ఠీవిగా నడిచివచ్చి ఆ అమ్మాయిని చూశాడు. రత్న పరీక్షలో రాటుదేలినవాడు ఏది నాణ్యమైనదో, ఏది నాసిరకానిదో పసిగట్టలేక పోతాడా? ఆమెను సాంగోపాంగంగా వీక్షించి తృప్తిగా కన్నెగరేశాడు. "నీ పేరేమిటీ?" అని అడిగాడు మృదువుగా. ఆమె చెప్పకపోగా, "పేరు కూడా లేదా?" అన్నాడు మోహన మంగళం.

ఆమె చిరునవ్వు నవ్వి, గోడమీదున్న హేమమాలిని బొమ్మవైపు చూస్తూ, "హేమమాలిని!" అంది.

ఆ రాత్రి పదిగంటల బస్సు వొచ్చే వరకూ మోహన మంగళంతో అన్ని వివరాలూ మాట్లాడుకుంటూ బస్టాండులో నిలబడ్డాడు బాలకృష్ణ.

"హేమమాలిని. పేరుకూడా బాగుంది కదూ?"

"మెల్లగా అంటారేమిటాప్సర్?"

"కులం అడిగితే చెప్పలేదేమిటీ ఆ అమ్మాయి?"

"చూడండి సార్! కులమూ గోత్రమూ అనుకుంటే, మీ కోరిక ఇక జన్మలో తీరదు. చక్కెరకు కులమేమిటండీ? తేనెకు కులం వుంటుందా?"

"నువ్వు కావ్యాలేమైనా రాశావా మోహన మంగళం?"

తెల్లవారగానే హేమమాలినిని తిరుమల కొండకు తీసుకురమ్మని చెప్పి, పది గంటలకు బస్సెక్కాడు బాలకృష్ణ.

మర్నాడు కొండమీద పుష్పవాటికల్లో

...హరిస్తూ ఆమె మెడలో మూడు తులాల బంగారపు నెక్లేస్ వేసి, రెండుజతల గాజులు చేతులకు తొడిగాడతను. ఆమెకోసం కొనుక్కొచ్చిన కొత్త చీరల్ని చూపాడు. "చూడు హేమా! ఇప్పటిదాకా నీకు ఎలాంటి అనుభవమూ లేదు కదూ?" అని అడిగాడు.

"అంటే?"

"అదే! మగవాడితో—"

"ఛీ. పొండి! నాకదేం తెలియదు."

"నిజం?"

ఆమె సిగ్గుముఖంలో గాంభీర్యం చోటు చేసుకుంది. "ఏడుకొండలవాడి సాక్షిగా ఇంతవరకూ ఏ మగాడితోనూ నాకు శారీరక సంబంధం లేదు" అంది.

ఆమాటే చాలు బాలకృష్ణకు ఇక కులంతో అవసరం లేదు. క్షణం ఆలస్యమయితే విఘ్నాలపైన విఘ్నాలొచ్చి పడతాయేమోనన్నంత ఆత్రంగా ఆమె మెడలో మంగళసూత్రం కట్టేశాడతను.

"ఇక నేను వెళ్ళి ఇల్లు చూస్తానండీ!" అన్నాడు మోహనమంగళం.

"ఇప్పుడా? నేనే చూసిపెట్టుకున్నాను. అనంతరామయ్యగారితో మంతనాలు మొదలెట్టినప్పుడే! ఇదిగో తాళంచెవి. నేండ్రగుంటలో యిల్లు. ఎవరినైనా అడిగితే చూపిస్తారు. నువ్వెళ్ళి సరుకులూ అవీ తీసి వుంచు. మేము చీకటిపడ్డాక వొస్తాం" అంటూ రెండువందలిచ్చాడు బాలకృష్ణ. "బుట్టెడు మల్లెపూలు దొరికితే తీసివుంచు. దొరికితే ఏమిటీ— దొరుకుతుందిలే! నీకు ఎక్కువగా చెప్పాల్సిందేముందిలే!" అన్నాడు వెనుకనుంచి.

పాకాలకు మూడు మైళ్ళ దూరంలో రోడ్డు పక్కనే వుంది నేండ్రగుంట. రాత్రి తొమ్మిది గంటలకు రోడ్డులో బస్సు దిగారు వధూవరులు. పెద్ద ముత్తైదువులా ఎదురొచ్చి తోడుకుని వెళ్ళాడు మోహనమంగళం. ఇన్స్పెక్టరుగారు అద్దెకు కుదుర్చుకున్న మూడంకణాల పూరింట్లో, గుగ్గిళ్ళకోసం గుళ్ళోకొచ్చి కూర్చున్న కుర్రమూకలా గోల పెట్టేస్తున్నాయి శోభన కళలు.

"భోజనానికి ఇబ్బంది పడాల్సొస్తుందని. బ్రెడ్డూ, బిస్కట్లూ, పళ్ళూ తెచ్చిపెట్టాన్సార్!" అన్నాడు మోహనమంగళం.

"మంచిపని చేశావ్!"

"నేను స్కూల్లోకెళ్ళి పడుకుంటానండీ!"

"మంచిది! స్కూలు తాళంచెవి నీదగ్గిర లేదుకదా?"

"స్కూలు తలుపు తెరవటానికి తాళం చెవెందుకండీ? అయినా, ఈ వూళ్ళో స్కూలుకు అసలు తలుపే లేదన్న సంగతి మీకు తెలీదేమిటి?"

మోహన మంగళం స్కూల్లో మేను వాల్చినవేళ నేండ్రగుంటలోని జనం ఎవ్వరూ నిద్రపోలేదు. పల్లెటూర్లో ఏదైనా వింతను కెలికి వినులవిందు చేసుకోవాలంటే అందుకు వేళాపాళా వుండదు.

ఉదయం నిద్రలేచి యింటి ముంగిట్లో కొచ్చిన మోహన మంగళాన్ని సంతోషంతో కౌగిలించుకున్నాడు బాలకృష్ణ. "నువు మనుచరిత్ర చదివావా? రాత్రి నా సుఖానికి ఫోటోరికార్డ్‌లాంటి పద్యం ఒకటి చెబుతారు పెద్దనగారు. "అన్నున కనుమూయుట, రొద సన్నగిలుట, కౌగిలింత సడలుట, నేర్పుల్ సున్నగుట, వరూధిని రతి కన్నెరికపు రతియుబోలె కడు నింపొసగెన్."

కన్నెరికపు రతిని కళ్ళకు కట్టుకుని పరాకున బడ్డాడు మోహనమంగళం. అతను సెలవు పుచ్చుకుని వచ్చేస్తూంటె "చూడు మోహనమంగళం! హేమమాలినికి కమ్మల జత కొనాలి. ఆమె చెవుల్లో యిప్పుడున్నవి రోల్డుగోల్డునిట!" అన్నాడు బాలకృష్ణ.

"చిత్తూరికో వేలూరికో వెళ్ళి కొందామండీ! అక్కడైతే మనకొవల్సిన డిజైన్స్‌లో దొరుకుతాయి."

మూడు వారాలు దొర్లిపోయాయి. పంతుళ్ళలో ఎవరినోట విన్నా ఇన్స్పెక్టరుగారి కొత్త కాపురం కబుర్లే! ఆయనిప్పుడు పొద్దుపోగానే తిరుపతికి కాదు వెళ్ళిపోతున్నది నేండ్రగుంటకు.

ఒకనాటి సాయంకాలం మోహన మంగళం యింటికొచ్చాడు బాలకృష్ణ. అతడి ముఖమంతా వాచిపోయి వుంది. బుగ్గలు కమిలాయి. నెత్తి బొప్పి కట్టింది.

"ఏమిటాసార్ యిది? నేండ్రగుంట నించే వస్తున్నారా?"

"కాదు తిరుపతి నుంచే వస్తున్నా!"

"నేండ్రగుంటలో దిగకుండానా?"

"ఔను."

"ఏం జరిగిందండీ?"

"నా పెళ్ళాం, కొడుకూ, కూతురూ మూకుమ్మడిగాకలిసి నన్ను కొట్టారయ్యా."

"మిమ్మల్ని కొట్టగలిగేటంత పిల్లలున్నారా మీకు!"

"కొడుకు ఎమ్మెస్సీ, కూతురు బీఎస్సీ! ఎందుకు కొట్టలేరు?...."

"మీరు చేసిన మహాపరాధం ఏమిటండీ?"

"మోహనమంగళం! పెద్ద చిక్కొచ్చి పడిందయ్యా యిప్పుడు. నేను హేమమాలినితో కాపురం జేస్తున్న సంగతి మా వాళ్ళకు తెలిసిపోయింది. రెండు రోజుల్లో ఆమెను వదిలెయ్యకపోతే, పైకి రిపోర్టురాసి ఉద్యోగం వూడగొట్టిస్తామనీ, జైల్లో తోయిస్తామనీ అల్టిమేటం యిచ్చారు!"

"అలాగా? ఇప్పుడేం జేస్తారు?"

"ఏం చెయ్యాలో తోచకుండా వుంది. ఆమెను వెళ్ళిపొమ్మన లేను. వుండమని ధైర్యంగా చెప్పనూలేను. దీనికి పరిష్కారం ఏమిటంటావ్?"

"నన్నడిగితే నేనేం చెబుతానండీ? ఈ సమస్యను ఆమె ముందర పెట్టేయటమే మంచిది."

"నన్నొదిలి తాను వుండలేనంటే?"

"అలా యెందుకనుకోవాలి? తృణమో పణమో తీసుకుని వెళ్ళిపోతాననొచ్చుగా?"

బాలకృష్ణ కొంతసేపు ఆలోచనలో మునిగిపోయి, "అంతేనంటావా?" అన్నాడు. "సరే, పోదాంరా!"

"అబ్బే, నేనెందుకండీ?"

"చూడు మోహన మంగళం! నీ కంటే ఆప్తులు నాకు యింకెవరున్నారు చెప్పు?" అంటూ బాలకృష్ణ దీనంగా ముఖం వేలాడేశాడు.

అతనితో కలిసి నేండ్రగుంటకు వెళ్ళక తప్పలేదు మోహన మంగళానికి.

ఇంటికి తాళంవేసి వుంది. తనవద్ద వున్న మారుతాళం చెవితో తాళంతీసి తలుపు తెరిచాడు బాలకృష్ణ. హేమమాలిని ఎక్కడికి వెళ్ళిందో ఏమో. పావుగంటసేపు వేచి చూసినా ఆమె ప్రత్యక్షం కాలేదు.

ఇంట్లో ఓ మూల ట్రంకు పెట్టెమీద రెపరెపలాడుతున్న కాగితం, దానిమీద మంగళసూత్రం కనిపించాయి. బాలకృష్ణ ఆ కాగితం అందుకుని చదవసాగాడు.

"భర్తకాని భర్తగారికి భార్యకాని మీ భార్య ప్రేమతో వ్రాయడం.

మీకు చెప్పి వెళ్ళటం కుదరదు. చెప్పకుండా వెళ్ళటం భావ్యమూ కాదు. కనుకనే ఈ కాగితం. నా పేరు హేమమాలిని కాదు. ఇక ఈ జన్మలో నేను మళ్ళీ మీ కంట బడననే అనుకుంటున్నాను. బ్రతుకు భయంతో దాగుడుమూతలాడే ఆడదాని దాపరికాన్ని తప్పు పట్టరనుకుంటాను.

ఏడాది కిందటే నాకు పెళ్ళయింది. మా నాన్న పెళ్ళిలో యిస్తానన్న ఐదువేల రూపాయల కట్నం మెడలో తాళికట్టిన వెంటనే యివ్వలేదన్న కారణంగా నేను కాపరానికి వెళ్ళలేదు. మా నాన్న వ్యవధి కావాలన్నాడు. కట్నం ముట్టేదాకా నా ముఖం చూసేది లేదన్నారు వాళ్ళు.

నాన్న దిగులుతో మంచాన పడ్డాడు. నన్ను అత్తవారింటికి పంపలేని దీనుడాయన. పెళ్ళయి కూడా మోడులా పుట్టింట్లో వుండిపోయిన నేను మా వాళ్ళకందరికీ గుండెలో ముల్లుగా తయారయ్యాను. ఆడది బ్రతు

కును డబ్బుతో కొనగలిగితేనే తప్ప మరో దారిలేని కాలం యిది. నా బ్రతుకు విలువ ఐదువేల రూపాయలు. కేవలం ఐదు వేలు లేనంత మాత్రానికే నా బ్రతుకు బండలై పోవాలా? కంటికి దూరంగా వెళ్ళి డబ్బు సంపాయిస్తే, అది ఏ మార్గంలో సంపాయించిందీ ఎవరికేం తెలుస్తుంది? ఈ నిర్ణయంతోనే ఒక తార్పుడిగాడి చిరునామా సంపాయించి తిరుపతికి బయలుదేరాను—కానీ యిక్కడ చిత్రంగా మీకు భార్యనయ్యాను. యిదే మంచిదయింది. నా దారిలో మీరు తారసపడకుండా వుండివుంటే రోగాలపుట్టగా మారివుండేదాన్నేమో!

నాకు పుస్తె కట్టినవాడు మరొకడున్నా, నేను మొట్టమొదట కొంగు పరిచింది మాత్రం మీకే! మిమ్మల్ని ఎలా మరిచిపోగలను? నా మనసులో దాపరికాలున్నా, మీ ఎదట నా శరీరాన్ని మాత్రం దాచుకోలేదు. నా నుంచి మీకు ఏమేం కావాలో అవన్నీ మనస్ఫూర్తిగా యిచ్చాను. మిమ్మల్ని వొదిలిపోవాలని నాకు లేదు. జీవితాంతం మీతో వుండిపోదామనే వుంది. అయితే మీకు పెళ్ళాం పిల్లలున్నారు. పరువు మర్యాదలున్నాయి. మీతో నేనుండటంవల్ల మీరూ బాగుపడరు, నేనూ బాగుపడను. అందుకే వెళ్ళిపోతున్నాను. మీరు నాకు తొడిగిన సొమ్ముల విలువ ఐదువేల కంటే ఎక్కువే వుంటుంది. దీంతో నా కట్నం సమస్య తీరిపోతుంది. నా భర్త దగ్గరకువెళ్ళి (మొదటిభర్త అనుకోనా, రెండోభర్త అనుకోనా?) గుట్టుగా కాపురం చేసుకుంటాను. మీ సొమ్ముల్ని నేను దొంగిలించుకు పోతున్నాననుకోరుకదూ? నేను మీ కిచ్చిన దానికి ఈపాటి ప్రతిఫలం నేను తీసుకోకూడదా, మీరివ్వకూడదా? దీంతోబాటు పెట్టెలో మీరు దాచిన రెండు వందలుకూడా దారిఖర్చులకు తీసుకుంటున్నాను. మీరు కట్టిన మంగళసూత్రాన్ని నేనెక్కడ దాచుకోను? దీన్ని మీ దగ్గిరే వుండనివ్వండి.

మీ క్షేమం కోరేదాన్ని గనక, చివర నా దొక ప్రార్థన. ఇక మీదట యెవరితోనూ ఇలాంటి వ్యవహారాలు పెట్టుకోవద్దండి. ఈ వయస్సులో యిలాంటివి మీ ఆరోగ్యాన్ని పాడుచెయ్యవా? నన్ను తలుచుకుంటూ విశ్రాంతి తీసుకోండి. మగస్పర్శ తగిలినప్పుడల్లా, మిమ్మల్ని జ్ఞాపకం చేసుకోకుండా నేను మాత్రం వుండగలనా? జీవితమంతా సరిపడేటన్ని ముద్దుల్ని మీకిచ్చి సెలవు తీసుకుంటున్నాను.

—మీ హేమమాలిని."

ఉత్తరం చదివి పూర్తి చేసేటప్పటికి, బాలకృష్ణకు గొంతు వణికింది.

"అయ్యో, అయ్యో! ఆరు తులాల బంగారం ఎత్తుకెళ్ళిపోయింది గదండీ!" అంటూ మోహన మంగళం అతడి ముఖంలోకి చూశాడు. బాలకృష్ణ చెంపలమీద కన్నీళ్ళు ధారలై కారుతున్నాయి.

"ఏడుస్తున్నారా సార్?"

"ఏడుపా? కాదే! సంతోషం కదా? ఏమో! ఒక కంట్లో దుఃఖాశ్రువులూ, మరో కంట్లో ఆనంద బాష్పాలేమో!" అంటూ మంచం మీదికి వాలి వెల్లకిలా పడుకున్నాడు బాలకృష్ణ. మంచం కోడుమీదున్న తువ్వాలును ముఖం మీదికి లాక్కున్నాడు.

అతడి గుండె క్రమస్థితికి రావటానికి ఐదు నిమిషాలసేపు పట్టింది.

"మోహన మంగళం?"

"సార్?"

"ఆరు తులాల బంగారమే కదా? తీసుకోనీ! ఆమె సుఖంగా వుండటమే నాక్కావల్సింది. ఆడా మగా కలయికకు బూతుమాట వొద్దనుకుంటే, సభ్యంగా ముద్దు అని చెప్పుకుందాం. ఆ అమ్మాయి తన తొలిముద్దులన్నిట్నీ నాకే యిచ్చిందయ్యా! జీవితంలో నేను చూడని రుచులవి! ఆ ముద్దులు ఎంత స్వచ్ఛమైనవో, ఎంత స్నేహపూరితమైనవో తెలుసా? ఎంత చురుక్కుమనిపించేవో తెలుసా? ఎంత తియ్యని నగుబాట్లు కలిగించేవో తెలుసా? మోహనమంగళం! నీకు అసలు విషయం చెప్పనా?...."

"ఏమిటాసార్?"

"అలాంటి ముద్దుల్ని నా పెళ్ళాం కూడా నాకివ్వలేకపోయింది. పెళ్ళికి ముందే అవి కొల్లబోయాయి...."

"ఏం మాటలండీ అవి?"

"ఇంటిగుట్టు పెదవిజారడం పొరపాటే! మరిచిపో—హేమమాలిని అందించిన ముద్దులకు విలువకట్టడం నా తరమా? తన తొలి ముద్దుల్ని అందుకున్న మగాడికి ఆడది ఉత్తరం రాస్తే అదెలా వుంటుందో తెలుసా? ఇదిగో ఇలా వుంటుంది, గుండె తెంపి మడతపెట్టినట్లు!" అంటూ గర్వంగా ఉత్తరాన్ని పైకెత్తి పట్టుకున్నాడు బాలకృష్ణ.

"పొద్దు వాటారిపోతున్న నాకు ఈ అమృత కలశం దొరకడం అదృష్టం కాదా? ఐదు వేలకు కక్కుర్తిపడి ఈ జీవన మాధుర్యాన్ని జారవిడుచుకున్నవాణ్ణి ఏమనాలి?"

ఏమనాలో తోచలేదు మోహనమంగళానికి.